ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 21.05.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. దేశంలో మహిళా రిజర్వేషన్ల ప్రక్రియకు దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ పునాది వేశారని, ఆయన స్ఫూర్తితో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

2. రాష్ట్రంలో యాసంగి పంట కొనుగోళ్ల సంక్షోభంపై రాబోయే కేబినెట్ సమావేశంలో దిద్దుబాటు చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి లేఖ రాశారు.

3. పవిత్ర సరస్వతి అంత్య పుష్కరాలు ఈరోజు వైభవంగా ప్రారంభమయ్యాయి.

4. రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరగడంతో అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్, ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాలకు అధికారులు రెడ్ అలెర్ట్ జారీ చేశారు.

**రాజీవ్ గాంధీ వర్ధంతి - రేవంత్ రెడ్డి**

దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ వద్ద ఆయన విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మట్లాడుతూ.. దేశానికి సాంకేతికతను పరిచయం చేసి ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చిన గొప్ప దార్శనికుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. సరళీకృత ఆర్థిక విధానాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిన ఘనత ఆయనదేనన్నారు. దేశంలో మహిళా రిజర్వేషన్ల ప్రక్రియకు ఆయనే పునాది వేశారని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు తీసుకురావాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. తక్షణమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును

ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ 33 శాతం మహిళా రిజర్వేషన్ల బిల్లుకు ఇండియా కూటమి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని స్పష్టం చేశారు.

బైట్ ... రేవంత్ రెడ్డి

డెస్క్

**భట్టి విక్రమార్క**

దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని న్యూఢిల్లీలోని 'వీర్ భూమి' వద్ద ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన రాజీవ్ గాంధీ సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి, దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

డెస్క్

**వాకిటి శ్రీహరి**

దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సమాచార సాంకేతిక రంగానికి బలమైన పునాదులు వేసిన మహానేత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ" అని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా నారాయణపేట జిల్లా, మక్తల్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కంప్యూటర్ విప్లవం, టెలికమ్యూనికేషన్ రంగ అభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం వంటి కీలక సంస్కరణల ద్వారా దేశాన్ని ఆధునిక యుగంలోకి తీసుకెళ్లిన నాయకుడిగా రాజీవ్ గాంధీ చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు.

పిటిసి, మహబూబ్ నగర్

**బహిరంగ లేఖ**

రాష్ట్రంలో నెలకొన్న పంట కొనుగోళ్ల సంక్షోభంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే. తారక రామారావు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. గత రెండు నెలలుగా కొనుగోలు కేంద్రాల్లో రైతులు అష్టకష్టాలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఆయన

తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట అమ్ముకోలేక రోజుల తరబడి వేచి చూస్తూ కొనుగోలు కేంద్రాల వద్దే దాదాపు పది మంది రైతులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని లేఖలో పేర్కొన్నారు. అకాల వర్షాలకు పంట కొట్టుకుపోతుంటే రైతులు నిస్సాహాయ స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 23న జరగబోయే కేబినెట్ సమావేశంలోనైనా ముఖ్యమంత్రి కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

డెస్క్

**సరస్వతి అంత్య పుష్కరాలు**

పవిత్ర సరస్వతి అంత్య పుష్కరాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పుష్కరాల తొలి రోజైన ఈ ఉదయం 5 గంటల 43 నిమిషాలకు పవిత్ర త్రివేణి సంగమం వద్ద తొలి పుష్కర స్నానం నిర్వహించారు. కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దంపతులు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పవిత్ర స్నానాలు ఆచరించారు. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ధార్మిక సలహాదారు గోవింద హరి, శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, మల్ రెడ్డి రంగారెడ్డి కూడా పుష్కర స్నానాలు చేసిన వారిలో ఉన్నారు. పుష్కరాల ప్రారంభం కావడంతో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. భక్తులు సౌకర్యవంతంగా, సురక్షితంగా పుష్కర స్నానాలు నిర్వహించుకునేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.

డెస్క్

శుభాకాంక్షలు

పవిత్ర “సరస్వతి అంత్య పుష్కర మహోత్సవం” సందర్భంగా భక్తులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈరోజు నుంచి జూన్ ఒకటో తేదీ వరకు జరిగే ఈ పుష్కరాలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు. కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, దైవానుగ్రహం పొందాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. పుష్కరాల కోసం తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున, పుష్కర స్నానాలకు వచ్చే భక్తులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని రేవంత్ రెడ్డి సూచించారు.

డెస్క్

**మంచిర్యాల – బైట్**

అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలోని నీల్వాయిలో జీవ వైవిధ్య వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా "ప్రకృతిమిత్ర" పర్యావరణ, సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు పర్యావరణంపై అవగాహన కలిగించేలా వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతిమిత్ర వ్యవస్థాపకుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత గుండేటి యోగేశ్వర్ మాట్లాడుతు...

బైట్ ... గుండేటి యోగేశ్వర్

పిటిసి, మంచిర్యాల

**మహబూబాబాద్ ఎమ్మెల్యే**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తూ.. వారికి అండగా నిలబడుతుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్ అన్నారు. మహబూబాబాద్ మండల ప్రజా పరిషత్ పాఠశాలలో అలీంకో సంస్థ సహకారంతో దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అవసరమైన ట్రై సైకిల్లు, వీల్ చైర్లు, వాకింగ్

స్టిక్స్ పంపిణీ చేస్తుందని, దివ్యాంగుల అభ్యున్నతి కోసం ప్రత్యేకంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని అన్నారు.

పి.టి.సి, మహబూబాబాద్

**మేడ్చల్ మల్కాజిగిరి**

మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజా సమస్యలు, అభివృద్ధిపై శాసనమండలిలో ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. జీహెచ్ఎంసీ నుంచి విడిపోయి కొత్తగా ఏర్పడిన మల్కాజిగిరి కార్పొరేషన్ లో అభివృద్ధి ప్రణాళికపై ప్రజా ప్రతినిధుల నుంచి ప్రతిపాదనలు స్వీకరించారు. అందరి సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, సుధీర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మల్లారెడ్డి, ఎంపీ ఈటెల రాజేందర్, మున్సిపల్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పిటిసి, మేడ్చల్ మల్కాజిరిగి

**నిజామాబాద్ కలెక్టర్**

జూన్ 2వ తేదీ లోపు ఇందిరా మహిళా శక్తి భవన సముదాయాన్ని పూర్తి చేసి, సంబంధిత శాఖ అధికారులకు అప్పగించాలని నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి.. అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నగరంలోని కలెక్టరేట్ సమీపంలో అధునాతన హంగులతో నూతనంగా నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవన సముదాయాన్ని ఆమె సందర్శించారు. తుది దశకు చేరుకున్న నిర్మాణ పనులను, వాటి నాణ్యతను పరిశీలించి.. చివరి దశలోని పనులను సైతం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎలాంటి అసౌకర్యాలకు తావు లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.

PTC, నిజామాబాద్

ఉపాధి హామీ కూలీలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.

పీటీసీ- భద్రాద్రి కొత్తగూడెం

**దరఖాస్తులు**

రాజన్న సిరిసిల్ల జిల్లా, మండేపల్లి ప్రభుత్వ ఐటీఐ, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లో 2026-2027 విద్యా సంవత్సరానికి మొదటి దశ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కవిత తెలిపారు. అభ్యర్థులు సబంధిత పత్రాలు, 6 తరగతులు చదివిన స్టడీ సర్టిఫికెట్స్, టీసీ, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈనెల 25 నుంచి జూన్ 8 వరకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్కులు, రిజర్వేషన్ల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు.

పిటిసి, రాజన్న సిరిసిల్ల

**వాతావరణం**

తెలంగాణలో ఎండల తీవ్రత పెరగడంతో అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్, ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ అయింది. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో అత్యధికంగా 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, 19 జిల్లాల్లో 46 డిగ్రీలు దాటింది. తీవ్ర వేడి గాలుల వల్ల వడదెబ్బతో 11 మంది మృతి చెందడంతో ప్రజలు పగటిపూట బయటకు రావొద్దని అధికారులు సూచించారు.

డెస్క్